ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్
1
RNI No: APTEL/2023/87888
సోమవారం
01 సెప్టెంబర్ 2025

# తెలుగువాడికి అవకాశం వచ్చింది..

## మద్దతివ్వండి: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 1, (రిపబ్లిక్ న్యూస్): ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రకటించామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇండియా కూటమి ఆలోచనను ఆయన గౌరవించారని చెప్పారు.



హైదరాబాద్లో జస్టిస్ సుదర్శన్రెడ్డితో కలిసి సీఎం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడారు. "ఇప్పుడు ఉపరాష్ట్రపతి ఎన్నికకు అంత్యంత ప్రాధాన్యత ఉంది. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేయాలనే ఎజెండాతో ఎన్డీయే అభ్యర్థిని పెట్టింది. రాజ్యాంగాన్ని పరిరక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో ఇండియా కూటమి జస్టిస్ సుదర్శన్రెడ్డిని బరిలోకి దింపింది. ఎన్నికలు, రాజకీయాలు, వివాదాలపై ఎప్పుడైనా మాట్లాడుకోవచ్చు. కానీ.. తెలుగువాడికి ఇప్పుడొక అవకాశం వచ్చింది. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మాజీ సీఎంలు కేసీఆర్, జగన్, ఎంఐఎం అధ్యక్షుడు అక్బరుద్దీన్ ఒవైసీలకు విజ్ఞప్తి చేస్తున్నా. రాజకీయంగా ఉన్న భిన్నాభిప్రాయాలను పక్కన పెట్టి సుదర్శన్రెడ్డికి మద్దతు ఇవ్వాలి" అని రేవంత్ రెడ్డి అన్నారు.

# 'ఆపరేషన్ స్వర్ణ'.. ఆక్రమణల తొలగింపునకు హైడ్రా

## తరహాలో టీమ్: తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి

తిరుపతి, సెప్టెంబర్ 1, (రిపబ్లిక్ న్యూస్): స్వర్ణముఖి నది పరిరక్షణకు కొత్త జీవో తీసుకొచ్చినట్లు తుడా ఛైర్మన్ దివాకర్రెడ్డి తెలిపారు. తిరుపతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైకాపా హయాంలో స్వర్ణముఖి నది వెంట భారీగా ఆక్రమణలు జరిగాయని ఆరోపించారు. నదికి ఇరువైపులా భూములు కొట్టేశారని విమర్శించారు. తప్పుడు పత్రాలతో దోచుకున్నారని మండిపడ్డారు. నది బఫర్ జోన్ ను పట్టించుకోకుండా కబ్జా చేశారన్నారు."ఆపరేషన్ స్వర్ణ పేరిట స్వర్ణముఖి నది ప్రక్షాళన చేపట్టనున్నాం. నదికి ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలు, కబ్జాలను తొలగిస్తాం. హైడ్రా తరహాలో ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేస్తున్నాం. డ్రోన్లను వినియోగించి సర్వే చేపడతాం. నది బఫర్ జోన్లో స్థలాలు విక్రయించిన వారిపై క్రిమినల్ కేసులు పెడతాం. నదిలో ఇళ్లు కట్టడం వల్ల రెండేళ్ల క్రితం అపార నష్టం జరిగింది. ఇదంతా గత వైకాపా ప్రభుత్వం చేసిన పాపం. తుడా, మున్సిపల్, ప్రభుత్వ అధికారులతో కమిటీ వేసి ఆక్రమణలు తొలగిస్తాం. ఆక్రమణలు చేసింది ఎంతటివారైనా వదిలేది లేదు.తుడాలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణ పూర్తయింది. మద్యం స్కామ్లో తుడా వాహనాలు వినియోగించారు. సంస్థ నిధులు రూ.270 కోట్లు ఎంపీడీవో ఖాతాలకు మళ్లించి దోచుకున్నారు. జిరాక్స్ కాపీల నుంచి విమాన టిక్కెట్లు, వాహనాలు అంతా కుంభకోణమే. గత ప్రభుత్వం తుడాను నాశనం చేసింది.. ఒక్క పైసా కూడా నిధుల్లేవు. శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారానికి ప్రయత్నాలు చేస్తున్నాం. వచ్చే ఏడాది జూన్, జులై కల్లా తుడా టవర్స్ పూర్తికి చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు.



# ఇంట్లో 'నాన్న'.. పనిలో 'బాస్'..

## సీఎం చంద్రబాబుకు లోకేశ్ విషెస్

అమరావతి, సెప్టెంబర్ 1, (రిపబ్లిక్ న్యూస్): చంద్రబాబు ముఖ్యమంత్రిగా 30 ఏళ్ల క్రితం చేపట్టిన బాధ్యతలు ఒక మైలురాయి కంటే ఎక్కువ అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. హైటెక్ సిటీ నుంచి క్వాంటం వరకూ సీఎంగా ఆయన ప్రయాణం ఒక సజీవ వారసత్వమని కొనియాడారు. బయోటెక్ ఆకాంక్షల నుంచి డేటా ఆధారిత ఆర్థిక వ్యవస్థల వరకు ఈ పురోగతే ప్రత్యక్ష సాక్ష్యమన్నారు.



ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణం చేసి మూడు దశాబ్దాలు పూర్తి చేసుకున్న నాన్నకు హృదయపూర్వక శుభాకాంక్షలు అంటూ లోకేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "ఇంట్లో 'నాన్న', పనిలో 'బాస్' అని పిలుచుకునే అదృష్టం నాకు లభించింది. పాలనకు సాంకేతికతను జోడించి పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన వరకూ ప్రయాణం సాగింది. సంక్షోభాలను సైతం అవకాశాలుగా మలుచుకుంటూ ముందుకు సాగారు. హైటెక్ సిటీ, జినోమ్ వ్యాలీ కొత్త సాంకేతిక గుర్తింపును శక్తిమంతం చేశారు. అమరావతి నిర్మాణం వరకు ఆయన నాయకత్వం ఎన్నో ఆవిష్కరణలకు మైలురాయి. వేగం, జవాబుదారీతనం, మౌలిక సదుపాయాల నిర్మాణం, డేటా ఆధారిత సేవలు, పౌరులు, సంస్థలను శక్తిమంతం చేసే వేదికలతో సరికొత్త ఒరవడి సృష్టించారు. చంద్రబాబు పదవీకాలం సామాజిక న్యాయం, బలహీనుల సాధికారతలో గణనీయమైన పెరుగుదలకు నాంది పలికింది. నదీ జలాల సద్వినియోగం కరవు ప్రాంతాల్లోని ప్రజల జీవితాలను మార్చేసింది. హంద్రీ-నీవా లాంటి కీలకమైన లిఫ్ట్ లింకేజీల ద్వారా కృష్ణా జలాలను రాయలసీమ ప్రాంతానికి తీసుకెళ్లి కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు అంతటా లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేశారు. గ్రామ చెరువులను స్థిరీకరించి వ్యవసాయాన్ని బలోపేతం చేశారు" అని నారా లోకేశ్ పేర్కొన్నారు.

### నాయకుడంటే ముందుండి నడిపించే వారని నిరూపించారు: మంత్రి పయ్యావుల

30 ఏళ్ల క్రితం ఇదేరోజు తొలిసారిగా సీఎంగా చంద్రబాబు ప్రమాణం చేశారని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. తెలుగు ప్రజల తలరాతలను మార్చిన అద్భుత ఘట్టమిదన్నారు. తెలుగు జాతి ఖ్యాతి దశదిశలా వ్యాప్తికి కారణభూతమైన మహత్తర సన్నివేశమని అభివర్ణించారు. నాయకుడంటే ముందుండి నడిపించే వారని నిరూపించిన సందర్భమన్నారు. ఐటీ విప్లవం తెచ్చినా, విద్యుత్ సంస్కరణలు చేసినా ప్రజల కోసమే అని వివరించారు.

### విజనరీ నాయకుడు దొరకడం తెలుగు ప్రజల అదృష్టం: మంత్రి డీబీవీ స్వామి

30 ఏళ్లలో చంద్రబాబు ఎన్నో పాలనా సంస్కరణలు తెచ్చారని మంత్రి డీబీవీ స్వామి తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేశారన్నారు. చంద్రబాబు వంటి విజనరీ నాయకుడు దొరకడం తెలుగు ప్రజల అదృష్టమని తెలిపారు.

### వంటింటికే పరిమితమైన మహిళలను ప్రగతి బాట పట్టించారు: మంత్రి అనిత

ప్రజలకు నాణ్యమైన, పారదర్శక సేవలు అందిస్తున్న హైటెక్ సీఎం చంద్రబాబు అని హోంమంత్రి అనిత అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పాలనకు సరికొత్త నిర్వచనం చూపిన దార్శనికుడు అని కొనియాడారు. ఇంటికి, వంటింటికే పరిమితమైన మహిళలను ప్రగతి బాట పట్టించారని పేర్కొన్నారు.

పాలనలో వినూత్న పద్ధతుల్ని తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదే: మంత్రి కొల్లు రవీంద్ర

చంద్రబాబు ప్రజల వద్దకే పాలన అంటూ గడపగడపకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. హైటెక్ సిటీ అనే నవ నగరాన్ని నిర్మించిన విజనరీ మన చంద్రబాబు అని కొనియాడారు. పాలనలో వినూత్న పద్ధతుల్ని తీసుకొచ్చిన ఘనత ఆయనదే అని పేర్కొన్నారు.

### తెలుగుజాతి వికాసానికి ఎనలేని సేవలు: మంత్రి సత్యకుమార్

తెలుగుజాతి వికాసానికి చంద్రబాబు ఎనలేని సేవలందిస్తున్నారని మంత్రి సత్యకుమార్ అన్నారు. తెలుగుజాతి ప్రతిభా పాటవాలను విశ్వవ్యాప్తం చేశారని పేర్కొన్నారు.

### వేలాది ఐటీ ఉద్యోగ అవకాశాలను సృష్టించారు: మంత్రి అచ్చెన్నాయుడు

వేలాది ఐటీ ఉద్యోగ అవకాశాలను చంద్రబాబు సృష్టించారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. తెలుగు ప్రజల గర్వకారణమైన నాయకుడిగా మరిన్ని విజయాలు చేకూరాలన్నారు. ఆయురారోగ్యాలతో ప్రజా సేవను కొనసాగించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# 'కల్కి 2' రిలీజ్ ఎప్పుడు?.. నాగ్ అశ్విన్ ఏం చెప్పారంటే!




ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కల్కి 2898 ఏడీ'. గతేడాది విడుదలైన ఈ చిత్రం భారతీయ సినిమాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చింది. దీనికి సీక్వెల్ ఉన్నట్లు ఇప్పటికే చిత్రబృందం వెల్లడించిన విషయం తెలిసిందే. ఇప్పటికే రెండో పార్ట్ నూ కొంత భాగం షూటింగ్ పూర్తయింది. అయితే మిగతా షూటింగ్ ఎప్పుడు ప్రారంభిస్తారు. రిలీజ్ ఎప్పుడు చేస్తారా అని అంతా ఎదురుచూస్తున్నారు. తాజాగా దీనిపై నాగ్ అశ్విన్ ఓ పాడ్కాస్ట్లో మాట్లాడారు. "కల్కి2 షూటింగ్ చాలా అంశాలతో ముడిపడిఉంది. అందులో నటీనటులందరికీ కాంబినేషన్ సన్నివేశాలు ఉన్నాయి. అందుకే వారందరికీ కుదిరినప్పుడే చిత్రీకరించాలి. యాక్షన్ సన్నివేశాలు కూడా భారీగా ఉంటాయి. వీటిని చిత్రీకరించడానికి చాలా సమయం పడుతుంది. దీని రిలీజ్పై నా దగ్గర కచ్చితమైన సమాధానం లేదు. ప్రస్తుతం కల్కిలో నటించిన స్టార్స్ అందరూ బిజీగా ఉన్నారు. ఈ ఏడాది చివర్లో మేం దీని షూటింగ్ ప్రారంభించాలని అనుకుంటున్నాం. షూటింగ్కు తక్కువ సమయం పట్టినప్పటికీ పోస్ట్ ప్రొడక్షన్ పనులకు ఎక్కువ సమయం పడుతుంది. మరో రెండు సంవత్సరాల్లో దీన్ని మీ ముందుకు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తా" అన్నారు. గతంలో నిర్మాత అశ్వనీదత్ ఓ ఇంటర్వ్యూలో 'కల్కి 2'స గురించి మాట్లాడుతూ.. "రెండో పార్ట్ మొత్తం కమల్ హాసనే ఉంటారు. ప్రభాస్, కమల్ హాసన్ల మధ్య సన్నివేశాలు ఉంటాయి. అమితాబ్ బచ్చన్ పాత్రకు కూడా ప్రాధాన్యం ఉంటుంది. ఈ మూడు పాత్రలే ఎక్కువగా కనిపిస్తాయి. వీళ్లే ఆ సినిమాకు మెయిన్. వీళ్లతో పాటు దీపికా పదుకొణె పాత్రకు కూడా ప్రాధాన్యం ఉంటుంది" అని అన్నారు. దీంతో ఈ చిత్రంపై అంచనాలు రెట్టింపయ్యాయి. ఇక ప్రస్తుతం ప్రభాస్ 'రాజాసాబ్, 'ఫౌజీ'లతో బిజీగా ఉన్నారు. ఈ నెలలో రాజాసాబ్ షూటింగ్ పూర్తయ్యే అవకాశం ఉంది. తర్వాత 'ఫౌజీ' సెట్లోకి అడుగు పెడతారు. దీనితో పాటు సందీప్ వంగా 'స్పిరిట్' కూడా లైన్లో ఉంది. అక్టోబర్ లో దీని షూటింగ్ ప్రారంభించాలని దర్శకుడు భావిస్తున్నారు. వీటి తర్వాత 'కల్కి 2'లో జాయిన్ అవుతారు.

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

రిపబ్లిక్ స్పోర్ట్స్

# బీసీసీఐ మెంటార్షిప్ వార్తలు..

## 'అసలు ధోనీ ఫోన్ లిఫ్ట్ చేస్తాడా?'




'భారత అత్యంత విజయవతమైన సారథి ఎంఎస్ ధోనీని మెంటార్గా నియమించుకొనేందుకు బీసీసీఐ ఆసక్తి చూపిస్తుంది'.. ఇదీ తాజాగా వైరల్ అయిన వార్త. గతంలోనూ (2021 టీ20 ప్రపంచకప్) కొన్ని రోజులపాటు మెంటార్గా ధోనీ వ్యవహరించిన సంగతి తెలిసిందే. దీంతో మరోసారి అతడికే ఆ బాధ్యతలు అప్పగించాలనేది బీసీసీఐ ఆలోచన అన్నట్లుగా కథనాలు వచ్చాయి. మరి ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఏమంటాడో కూడా ఆసక్తికరమే. ఇలాంటి సమయంలో భారత మాజీ ఆటగాడు మనోజ్ తివారీ చేసిన కామెంట్లు వైరల్ గా మారాయి. అసలు ధోనీ ఫోన్ అయినా ఎత్తుతాడా? అంటూ మనోజ్ వ్యాఖ్యానించాడు. "కాలమే సమాధానం చెబుతుంది. ధోనీకి బీసీసీఐ ఆఫర్ ఇవ్వాలని అనుకున్నా సరే.. కనీసం అతడు ఫోన్ అయినా లిఫ్ట్ చేస్తాడా? అనేది నా అనుమానం. ఎందుకంటే ఫోన్లో అతడిని కలవడం చాలా కష్టం. ధోనీ నుంచి మెసేజ్ రూపంలో రిప్లయ్ రావడం కూడా అరుదే. ఈ విషయాన్ని కొత్తగా నేను చెప్పడం లేదు. ఇప్పటికే చాలామంది ప్లేయర్లు ఆయా సందర్భాల్లో చెప్పారు. అసలు మెసేజ్లు కూడా అతడు చదువుతాడో? లేదో కూడా తెలియదు" అని తివారీ తెలిపాడు.

### జట్టుకు చాలా ప్రయోజనం..

"ఫస్ట్ ధోనీ ఆఫర్ను ఓకే అనడంపై ఇప్పుడే అంచనా వేయలేం. అయితే, మెంటార్గా వస్తే మాత్రం టీమ్ ఇండియాకు చాలా బెనిఫిట్. అతడి కెప్టెన్సీ అనుభవం, వ్యూహాలను అమలు చేయడంలో చురుకుదనం మేలు చేస్తాయి. ఇప్పుడున్న క్రికెటర్లతోపాటు రాబోయే యువ ఆటగాళ్లు అతడికి గౌరవం ఇస్తారు. గౌతమ్ గంభీర్ - ధోనీ కలిసి పనిచేయడం కూడా చూడదగ్గదే. జట్టు మరింత పదునుగా మారే అవకాశం ఉంది" అని మనోజ్ తివారీ వ్యాఖ్యానించాడు.

## అందం

# జుట్టుకి బయట కొనుక్కొచ్చిన హెయిర్ కలర్స్ బదులు ఇంట్లోనే

## తయారుచేసిన కలర్స్ వాడితే ఒత్తుగా పెరుగుతుంది

ఇదివరకటి రోజుల్లో జుట్టు నల్లగానే ఉంటే అందంగా ఉంటుందనుకునేవారు. కానీ, రాన్రాను ఫ్యాషన్ పెరిగిపోయి రకరకాల రంగులు వేసుకోవడం మొదలుపెట్టారు. అలాంటి హెయిర్ కలర్స్ని ఇంట్లోనే ఎలా తయారుచేసుకోవాలో తెలుసుకోండి.



జుట్టుకి కలర్ వేయడం ఇప్పుడు ఫ్యాషన్. కాలేజీకి వెళ్లే వారి దగ్గర్నుంచి ఆఫీస్ వెళ్లేవారి వరకూ రకరకాల కలర్స్ వేసుకోవడం అలవాటుగా మారింది. బర్గండీ, మెరూన్, గ్రే ఇలాంటి కలర్స్ వేసుకుంటూ అందంగా మురిసిపోతారు. ఇదిప్పుడు ఫ్యాషన్గా కూడా మారింది. దీంతో మార్కెట్లో రకరకాల రంగుల్లో హెయిర్ కలర్స్ని తయారుచేసి ప్రవేశపెట్టారు. అయితే, ఇవన్నీ చూడ్డానికి చక్కగా కనిపించినప్పటికీ అందులో కొన్ని కెమికల్స్ ఉంటాయి. అవి జుట్టుని డ్రైగా చేసి పాడు చేస్తాయి. వీటితో పాటు జుట్టు నిర్జీవంగా మారుతుంది. దీంతో జుట్టుకి లేనిపోని హంగులు ఎందుకు జుట్టు బాగుంటే అదే చాలని కలర్స్కి ఫుల్స్టాప్ పెడుతున్నారు. అలా కాకుండా ఇంట్లోనే మనం కొన్ని కలర్స్ని తయారుచేసి హ్యాపీగా స్టైల్ చేయొచ్చు. దీని వల్ల మీకు నచ్చిన రంగుని వేసుకోవచ్చు. జుట్టుని సిల్కీ అండ్ స్మూత్గా చేసుకోవచ్చు. అంతేకాకుండా స్ట్రాంగ్గా కూడా మారుతుంది. మరింకెందుకు ఆలస్యం వీటిని ఎలా తయారుచేయొచ్చో తెలుసుకోండి.

### దాల్చినచెక్కతో



మంచి రెడిష్ బ్రౌన్ కలర్ రావాలంటే దాల్చిన చెక్కని ట్రై చేయొచ్చు. దీనికోసం అరకప్పు కండీషనర్లో అరకప్పు దాల్చిన చెక్క పొడిని వేసి బాగా కలపాలి. దీనిని మన జుట్టుకి మాస్క్లా వేసి 45 నుంచి 60 నిమిషాల పాటు ఉంచాలి. తర్వాత షాంపూ చేయాలి. ఇలా చేయడం వల్ల దాల్చినచెక్కలోని మాయిశ్చరైజింగ్ గుణాలు జుట్టుని సాఫ్ట్గా చేస్తాయి. అందంగా మారుసాయి.

### కాఫీ కలర్తో



దీనికోసం మనం అరకప్పు ఎస్ప్రెస్సోని తీసుకోవాలి. దీనిని అరకప్పు కండీషనర్లో కలపాలి. తర్వాత ఇందులోనే 1 టేబుల్ స్పూన్ కాఫీ పౌడర్ కలపాలి. దీనిని బాగా కలిపితే మంచి కలర్లా మారుతుంది. దీనిని మన జుట్టుకి మాస్క్లా వేసుకోవాలి. 60 నిమిషాల తర్వాత క్లీన్ చేసుకోవాలి. కాఫీ అనేది జుట్టుకి మంచి టానిక్లా పనిచేస్తుంది. కాఫీని అప్లై చేయడం వల్ల హెయిర్ సెల్స్ స్టిమ్యులేట్ అవుతాయి. దీంతో జుట్టు సమస్యలు కూడా దూరమై జుట్టు స్ట్రాంగ్ అవుతుంది.

### ఫుడ్ కలర్తో



ఫుడ్కలర్తో కూడా జుట్టుకి మంచి కలర్ని తీసుకురావొచ్చు. దీనికోసం అరకప్పు మంచి హెయిర్ కండీషనర్ తీసుకోండి. ఇందులో కొన్ని చుక్కల మీకు ఇష్టమైన ఫుడ్ కలర్ని యాడ్ చేయండి. మీకు ఎక్కువగా థిక్గా కావాలనుకుంటే ఎక్కువ కలర్ యాడ్ చేయండి. ఫుడ్ కలర్ యాడ్ చేయడం వల్ల జుట్టుకి మంచి కలర్ వస్తుంది. కెమికల్ ఫ్రీ కలర్ కాబట్టి, జుట్టు అందంగా, సాఫ్ట్గా మారుతుంది. ఈ కలర్ మీకు జుట్టుకి కావాల్సిన చోట అప్లై చేసి 15 నుంచి 20 నిమిషాల పాటు ఉంచాలి.

### బీట్రూట్తో




మంచి పర్పుల్, బర్గండీ కలర్లో జుట్టు మారాలంటే ఇది బెస్ట్ ఆప్షన్. ఓ బీట్రూట్ని చక్కగా చిన్నచిన్న ముక్కలుగా కట్ చేయండి. దీనిని ఓ టీ స్పూన్ తేనె, 1 టీ స్పూన్ కొబ్బరినూనెతో కలిపి ఓ బౌల్లో వేసి పెట్టండి. దీనిని జుట్టుకి రాసి 60 నిమిషాల పాటు అలానే ఉంచి ఆ తర్వాత మైల్డ్ షాంపూతో తలని రుద్దండి. దీంతో జుట్టు మంచి పర్పుల్ కలర్లో అందంగా మారుతుంది. బీట్రూట్లో నేచురల్గానే మంచి కలర్ ఉంటుంది. ఇది జుట్టుకి మంచి రంగుని ఇవ్వడమే కాకుండా స్కాల్ప్, హెయిర్ని హెల్దీగా మారుతుంది. బౌన్సీగా మారుతుంది. జుట్టు కూడా స్మూత్గా మారుతుంది.

### క్యారెట్ జ్యూస్



కొంతమందికి రెడిష్ ఆరెంజ్ కలర్ అంటే ఇష్టం. అలాంటి వారు క్యారెట్తో చక్కని కలర్ని రెడీ చేసుకోవచ్చు. దీనికోసం 1 టేబుల్ కొబ్బరినూనె లేదా ఆలివ్ ఆయిల్లో ఓ టేబుల్ స్పూన్ క్యారెట్ జ్యూస్ కలపాలి. బాగా మిక్స్ చేయాలి. దీనిని జుట్టుకి అప్లై చేసి చేయాలి. 60 నిమిషాల పాటు అలానే ఉంచి ఆ తర్వాత కొద్దిగా ఆపిల్ సైడర్ వెనిగర్ కలిపిన నీటితో వాష్ చేసుకోవాలి. దీంతో మంచి షైనీ కలర్ వస్తుంది. క్యారెట్స్లో విటమిన్ ఎ ఎక్కువగా ఉంటుంది. దీనిని రాయడం వల్ల జుట్టు పొడుగ్గా, ఒత్తుగా పెరుగుతుంది.



గమనిక:నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.